యూనిట్ II

# 4. సమయస్ఫూర్తి

**ఆలోచించండి-మాట్లాడండి**




**ప్రశ్నలు:**

1. రాజు గుర్రాన్ని తక్కువ ధరకు ఎందుకు కొనాలనుకున్నాడు?
2. పై కథలలో ఎవరెవరి మధ్య సంభాషణ జరిగింది?
3. రాజు, వర్తకుడు చెప్పిన ధరకంటే ఎక్కువ చెల్లించడానికి కారణాలు ఊహించి చెప్పండి.

**ఉద్దేశం:** ప్రత్యేక అవసరాలు గల వారికి సానుభూతిగాదు, ఆత్మస్థైర్యం కావాలని చెప్పడం, సేవాభావంతో సహకరించాలని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఇతరులకు సాయపడే మనస్తత్వం ఉన్నవాడు రామానందుడు. ఆ గ్రామంలో ఉన్న సోముడితో అతనికి పరిచయం ఉంది. సోముడు గుడ్డివాడు. కాబట్టి సోముడికి సాయపడాలనుకున్నాడు. సోముడు అంగవైకల్యాన్ని అధిగమించి జీవితంలో స్థిరపడాలంటే ఏదైనా విద్య నేర్పించడం అవసరమని గ్రహించి, తన సంపాదనలో కొంత ఖర్చు చేసి ఒక సంగీత విద్యాంసుడి దగ్గర చేర్పించాడు.



భగవంతుడు దయామయుడు. సోముడికి కళ్లు ఇవ్వలేకపోయినా గొంతులో మాధుర్యాన్ని ఇచ్చాడు. నిరంతర సాధనతో సోముడు కొద్ది కాలంలోనే గురువు మన్ననలను పొందాడు.

సోముడు రామానందుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ "మొదట నువ్వు సాయపడతానంటే ఎంతో కొంత డబ్బు ఇచ్చి తాత్కాలిక సాయం చేస్తావనుకున్నాను. ఇలా శాశ్వత సంపద అందజేస్తావనుకోలేదు. నీలా ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే బాగుంటుంది. అంగవైకల్యం ఉన్నవారికి తాత్కాలిక సాయంగాని, సానుభూతిగాని పెద్దగా ఉపయోగపడదు. ఆత్మస్థైర్యం పెంచే నీ సాయం కొండంత అండ" అంటూ రామానందుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు సోముడు.

"నా మనస్సుకు పుట్టిన బుద్ధితో నాకు చేతనైనంత సాయం చేశాను. ఇందులో కృతజ్ఞతలు చెప్పుకోవాల్సినంత గొప్పతనం లేదు. ఇచ్చి పుచ్చుకోడమే మానవ జీవితం. రేపటి రోజు ఈ సంగీతాన్ని నలుగురికీ నేర్పి ప్రతిభావంతుల్ని వెలికి




© SCERT not to be republished

తీస్తావు. ఈ రోజు నేను అందజేసినది రేపు నువ్వు నలుగురికి పంచుతావు ఇది నిజం కదా!" అంటూ తల నిమిరాడు రామానందుడు.

రామానందుడి ఆప్యాయతకు సోముడి కళ్ళు చెమర్చాయి. "అన్నా! నువ్వు చెప్పినట్టే ఈ శాశ్వత సంపదను నలుగురికి పంచుతాను" అన్నాడు సోముడు.

"ఈ రాజ్యంలో రాజుగారు కళాప్రియులు. అతని దగ్గర నీ ప్రతిభ చూపించి సంగీత కళాశాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుందాం" అంటూ అభయమిచ్చాడు రామానందుడు.

సోముడితో కొద్దిరోజుల సావాసంవల్ల రామానందుడికి కూడా సంగీతంలో ప్రవేశం కలిగింది. సోముడిలో ఒంటరితనం పోగొట్టేందుకు రామానందుడు తనకు తీరిక దొరికినప్పుడల్లా వచ్చి సోముడితో సంగీత సాధన చేస్తుండేవాడు. చివరకు రామానందుకు కూడా సంగీతంలో ప్రావీణ్యత సంపాదించాడు.





ఒకరోజున రామానందుడు సోముడ్ని వెంటపెట్టుకుని సంగీత ప్రదర్శన ఇచ్చేందుకు రాజుగారి కోటకు చేరుకున్నారు. ప్రవేశ ద్వారం దగ్గర అడ్డంకులు ఎదురయ్యాయి. రాజదర్శనం అంత తేలిక కాదన్నారు కాపలాదారులు.

కాపలా భటులు లంచం ఆశిస్తున్నట్టు గ్రహించిన రామానందుడు రాజుగారు ఇచ్చే కానుకల్లో సగం ముట్టచెబుతామని ఒప్పందం కుదుర్చుకున్నాడు.

రాజాస్థానంలో ప్రవేశం కలిగింది. రాజుగారి అనుమతితో సంగీత ప్రతిభను ప్రదర్శించారు. చూసిన వారంతా చప్పట్లతో జేజేలు పలికారు.

రాజు సంతృప్తిచెంది చెరో వంద బంగారు నాణేలు ఇద్దరికి బహూకరించాడు.

రామానందుడు తన వాటాలో యాభై నాణేలను లెక్కించి రాజుగారికి తిరిగి ఇవ్వబోయాడు.

రామానందుడి చర్య రాజుగారిని అవమానించేట్టు ఉండడంతో రాజుగారికి కోపం వచ్చింది. పక్కనే ఉన్న మంత్రి కలగజేసుకుని 'నువ్వు చేస్తున్న పని ఏమిటి?' అని నిలదీసాడు.

"క్షమించండి! నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?" అని ధైర్యంగా అడిగాడు రామానందుడు.

రాజుగారికి కోపం చల్లారింది. రామానందుడి చేతల్లో ఏదో ఆంతర్యం ఉందని గ్రహించి "ముందు అబద్ధం చెప్పు. అది మాకు సబబుగా అనిపించకపోతే మీ తల కోట గుమ్మానికి వేలాడుతుంది" హెచ్చరికగా చెప్పాడు.

"అబద్ధం వినండి! మేమిద్దరం గుడ్డివాళ్ళమనే సానుభూతితో చెరో వంద బంగారు నాణేలు కానుకగా ఇచ్చారు. నాకు ఒక కన్ను కనిపిస్తోంది. నా మిత్రునికి రెండు కళ్ళూ కనిపించవు. అతనికి వంద నాణేలు ఇచ్చినప్పుడు న్యాయంగా యాభై నాణేలు మాత్రమే నేను తీసుకోవాలిగా అందుకే తిరిగి యాభై నాణేలు మీకు అందించింది" అన్నాడు రామానందుడు.

రాజు సంతృప్తి చెందాడు. 'అయితే ఈ సారి నిజం చెప్పు' అన్నాడు రాజు.

"మీరు నటనా సార్వభౌములు. గొప్పగా నటించగలరు. అందులో ఇప్పుడు నటిస్తున్న గుడ్డివాడి పాత్ర అమోఘంగా ఉంది. తోటి కళాకారుడ్ని ప్రోత్సహించడం కళాకారుడిగా నా ధర్మం. అందుకే యాభై నాణేలు ప్రోత్సాహ బహుమతిగా ఇవ్వచూపింది" అన్నాడు రామానందుడు.

ఒక్కసారిగా రాజుగారి ముఖ కవళికలు మారిపోయాయి. "నేను గుడ్డివాడిగా నటిస్తున్నానా! రుజువేంటి?" కోపంతో అడిగాడు.

అప్పుడు కాపలా భటుల లంచాల గురించి తెలియజేస్తూ, "కోటలో జరుగుతున్న అవినీతి చర్యలను చూడలేని మిమ్మల్ని గుడ్డివాడిగా అంచనా వేయడంలో తప్పులేదుగా! అదే రుజువు," అన్నాడు రామానందుడు.

అవినీతి బండారాన్ని సమయస్ఫూర్తితో తెలియజేసిన రామానందుడిని మెచ్చుకొన్నాడు. మరిన్ని కానుకలతో ఆ ఇద్దరినీ సత్కరించాడు రాజుగారు.

ఆ కానుకలతో సంగీత కళాశాల స్థాపనకు పూనుకున్నాడు రామానందుడు.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. తాత్కాలిక సాయానికి, శాశ్వత సాయానికి తేడా ఏమిటి?
2. సోముడు, రామానందుడు, రాజు ఈ ముగ్గురిలో ఎవరి పాత్ర నచ్చింది? ఎందుకు?
3. ఈ పాఠంలోని సందేశాన్ని సొంత మాటల్లో చెప్పండి.
4. రాజు కళ్ళు ఉండి గుడ్డివాడు ఎందుకయ్యాడు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. **పాఠం చదవండి. కింది సూచనలకు అనుగుణంగా వాక్యాలను పాఠంలో వెతకండి. వాటి కింద గీతగీయండి.**

అ) 'సాయపడడం' అనే అర్థాన్నిచ్చే వాక్యాలు.

ఆ) కృతజ్ఞతలు తెలిపే భావం వచ్చే వాక్యాలు.

ఇ) బహుమానం, సత్కారం లాంటి భావం వచ్చే వాక్యాలు.

ఈ) రాజుకు కోపాన్ని తెప్పించిన వాక్యాలు.

2. **కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

కళ్ళులేనివాళ్లు, కాళ్ళులేనివాళ్ళు, చెవులు వినిపించనివాళ్ళను మనం వికలాంగులుగా భావిస్తుంటాం. కానీ వీరుకూడా మనలాగే జీవిస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా తమ పనులను తామే చేసుకుంటారు. చెవులు వినిపించని, మాటలు రాని వారుకూడా మాట్లాడేవారిలాగే సైగల భాషలో (sign language) తమ భావాలను వ్యక్తపరుచుకుంటారు. ఇలా భావవినిమయం చేసుకోడంలో అక్షరాలు, పదాలు, వాక్యాలు... అన్నీ ఉంటాయి. అంటే ఇవన్నీ ధ్వనుల రూపంలో కాకుండా సైగల రూపంలో ఉంటాయి. అన్ని అవయవాలున్న వారు కూడా కొన్ని పనులు చేయలేరు. వికలాంగులను ప్రత్యేక అవసరాలు గల పిల్లలని అంటున్నారు. అన్నీ ఉన్నా కొన్ని పనులు చేయలేని మనం కూడా ఒక రకంగా వికలాంగులమే! ఒక రోజు కళ్ళు మూసుకొని గడపగలమా? ఒక కాలిని ముడుచుకొని కదలగలమా? మాట్లాడకుండా ఉండగలమా? ఇలా చేసి చూస్తే అవయవాలు లేనివారిలో ఉండే గొప్పతనం మనకు తెలుస్తుంది.

అ) పై పేరాలో ఎవరెవరి గురించి చెప్పారు?

ఆ) పై పేరాకు చక్కని పేరు పెట్టండి.



ఇ) మాటలు రాని వారి అక్షరాలు, పదాలు, వాక్యాలు ఏరూపంలో ఉంటాయి?

ఈ) వికలాంగులైన పిల్లలను మనం ఇప్పుడు ఏమని పిలుస్తున్నాం?

ఉ) "మనం ఒక రకంగా వికలాంగులమే" ఎలాగో చెప్పండి.

3. **పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రామానందుడు సోముడికి ఎందుకు సాయం చేశాడు?

ఆ) రాజభటులతో రామానందం, సోముడు ఏమి ఒప్పందం చేసుకొన్నారు?

ఇ) రాజుగారు రామానందున్ని ఎందుకు సత్కరించాడు?

### III. స్వీయరచన



1. **కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) కళ్ళులేనివారు, కాళ్ళు లేనివారు... ఇలాంటి వారికి మీరైతే ఏం సహాయం చేస్తారు?

ఆ) 'రాజు కళా ప్రియుడని' రామానందుడు చెప్పాడు కదా! దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

ఇ) రాజు కళ్ళున్న గుడ్డివాడని రామానందుడు చెప్పటాన్ని నువ్వు ఎలా అర్థం చేసుకున్నావు?

ఈ) ఇచ్చిపుచ్చుకోడమే మానవ జీవితం. అవునా? కాదా? ఎందుకు?

ఉ) సమయస్ఫూర్తి అంటే ఏమిటి?

ఈ) సానుభూతి కంటే ఆత్మస్థైర్యం ఎందుకు గొప్పది?

2. **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) కష్టసమయంలో సమయస్ఫూర్తి మనిషిని గట్టెక్కిస్తుందని, ఉదాహరణలతో చెప్పండి.

ఆ) అవినీతివల్ల కలిగే నష్టాలు వివరించండి.

ఇ) కథను సొంతమాటల్లో రాయండి.

### IV. పదజాలం



1. **కింది వాక్యాలలో గీత గీసిన పదాన్ని బహువచనంలోకి మార్చి, తిరిగి వాక్యం రాయండి.**

అ) గ్రామం ప్రకృతి అందాలకు నిలయం

ఉదా:-బహువచనం రూపం : గ్రామాలు

వాక్యం : గ్రామాలు ప్రకృతి అందాలకు నిలయాలు.



©SCERT not to be republished



ఆ) మాకు చదువు చెప్పిన గురువు మహాజ్ఞాని.

ఇ) మానవుడు సంఘజీవి.

ఈ) లోపలికి వెళ్ళకుండా రాజభటుడు అడ్డుకున్నాడు.

2. **కింది పదాలకు అర్థాలు రాయండి. వాటిని సొంతవాక్యాలలో రాయండి.**

అ) గోపాలుని ప్రతిభను ఉపాధ్యాయుడు గుర్తించాడు.

ఉదా:- ప్రతిభ = తెలివి

తెలివైనవారు సమస్యల నుండి బయటపడతారు.

ఆ) ప్రజ్ఞకు పాటల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది.

ఇ) గీత మొదటి ర్యాంకు తెచ్చుకొని, తెలివైనదని రుజువు చేసుకుంది.

ఈ) అబద్ధం చెప్పటం ఉత్తముల లక్షణం కాదు.

3. **కింది ప్రకృతి, వికృతి పదాలను చదివి జతపరచండి.**

అ) వృద్ధ ( ) i) జీతం

ఆ) సహాయం ( ) ii) పెద్ద

ఇ) జీవితం ( ) iii) నిక్కం

ఈ) నిజం ( ) v) సాయం

4. **కింది గళ్ళలోని సమానార్థ పదాలు గుర్తించి, ఒక వరసలో రాయండి.**

| | | | |
|---|---|---|---|
| అసత్యం | మంత్రి | భూపాలుడు | కల్ల |
| పల్లె | మనసు | గ్రామం | చిత్తం |
| నృపుడు | అబద్ధం | బుద్ధి | ప్రగడ |
| ఊరు | అమాత్యుడు | బొంకు | మతి |
| రాజు | నియోగి | ప్రభువు | పల్లె |

అ) మంత్రి, అమాత్యుడు, నియోగి, ప్రగడ

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________



5. **పాఠాన్ని ఆధారం చేసుకొని, తప్పొప్పులను గుర్తించండి.**

అ) రామానందుడు సంగీతంలో ప్రావీణ్యం సంపాదించాడు. ( )

ఆ) సోము ఇంటిదగ్గరే సంగీతం నేర్చుకున్నాడు. ( )

ఇ) రామానందునిది సాయపడే మనస్తత్వం కాదు. ( )

ఈ) భటులను రాజు శిక్షించాడు. ( )

ఉ) సోముడు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. ( )

### V. సృజనాత్మకత



**కింది వాటిలో ఏదైనా ఒకటి రాయండి / చేయండి.**

అ) సమయస్ఫూర్తి పాఠాన్ని సంభాషణ రూపంలోకి మార్చి రాయండి.

ఆ) నేడు అవినీతి దేశమంతా వ్యాపించింది. లంచం ఇవ్వనిదే ఏ పనీ జరగటం లేదు. అవినీతి నిర్మూలనపై ప్రజలలో చైతన్యం నింపే విధంగా ఒక పోస్టరు తయారుచేయండి.

### VI. ప్రశంస



**రామానందుడు కళ్ళు లేని సోముడికి సహాయం చేస్తాడు కదా! మీరు కూడా ఇలాంటివారికి ఎలాంటి సహాయం చేస్తారో రాయండి.**

### VII. భాషాంశాలు



1. **కింది పదాల్లోని భాషాభాగాలు గుర్తించి రాయండి.**

జాన్, ఆహో!, చేశాను, నల్లని, వారు, మెల్లగా, చల్లని, వంకాయలు, ఓహో!, తిన్నాను, పొద్దుగ్గా, పుస్తకం, ఆంధ్రప్రదేశ్, రాశాను, అలానా?, బడి, మీరు, వెతికాను, హమ్మయ్య, అతను, నవ్వుతున్నారు, గట్టిగా, ఆమె, ఇది, భలే! చేదైన.

2. **కింది వాక్యాలలోని విభక్తి ప్రత్యయాలను గుర్తించి అవి ఏ విభక్తులో రాయండి.**

ఉదా॥ సమావేశంలో చదివిన విషయం బాగుంది = -'లో' - షష్ఠీవిభక్తి

అ) జాతీయ జెండా గాలికి రెపరెపలాడుతున్నది. = __________ __________

ఆ) ప్రకృతి రహస్యాలను అన్వేషించండి. = __________ __________

| | | | | |
|---|---|---|---|---|
| ఇ) | నిఖిల్ నితీష్ కంటె పెద్దవాడు. | = | ________ | ________ |
| ఈ) | జ్ఞానేంద్రియాలచేత గ్రహిస్తాం. | = | ________ | ________ |
| ఉ) | బాధవల్ల దుఃఖం వస్తుంది. | = | ________ | ________ |
| ఊ) | ధ్వనులనుబట్టి జంతువులను గుర్తించవచ్చు. | = | ________ | ________ |
| ఋ) | రాముడు, ధేనువు పాలు పిండుతున్నాడు. | = | ________ | ________ |

## ప్రాజెక్టు పని

**వికలాంగులకు సంబంధించిన విజయాలను కథలను, సేకరించి, వీటిని ఒక నోటు బుక్‌లో అతికించండి. వాటిని మీరు, మీ మిత్రులు చదవండి. వాటి ఆధారంగా సూక్తుల్ని నినాదాల్ని తయారుచేయండి.**



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | కథను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను, కీలక పదాల ఆధారంగా పేరాలు గుర్తించగలను. | ఔను / కాదు |
| 3. | కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | అవినీతిపై చైతన్యం కలిగించేలా పోస్టరు తయారుచేయగలను. | ఔను / కాదు |

*"ప్రవచనాల కంటే ప్రవర్తనే ముఖ్యం."*



© SCERT not to be republished